# అసూయ

– వసుంధర



ఎవరో చందాల వాళ్ళొస్తే తలుపు ముందు ఎదిరింటి 'అరుగుమీద విల తీశాను. చందాల వాళ్ళకంటే బడి మా ఇంటికేసే చూస్తున్న

రాజారాం కనబడ్డాడు. పలకరింపుగా నవ్వాను. రాజారాం నవ్వలేదు. నన్ను చూడనట్లుగా ముఖం మరో ప్రక్కకు తిప్పుతున్నాడు. నన్ను చూడలేదేమోలే అనుకున్నాను.

ఆఫీసుకెళ్ళేటప్పుడు మళ్ళీ కన బడ్డాడు రాజారాం. సాధారణంగా నన్ను చూడగానే ఆగుతాడు. నన్ను చూశాడనే అనుకొన్నానుగానీ ఆగ లేదు. చూసి వుండడులే అని సరి పెట్టుకున్నాను.

రాజారాందీ, నాదీ పక్క పక్క ఆఫీసులు. మాకో కామన్ కాంటీన్ ఉంది మధ్యాహ్నం నేను అక్కడ కాఫీ తాగుతూండగా వచ్చాడు రాజారాం. నా పక్క సీటు ఖాళీగా ఉంది. సాధారణంగా రాజారాం నా పక్కనే కూర్చుంటాడు. నేనం దుకు సిద్ధపడ్డాను. కానీ అతను నా వేపు చూడకుండా నన్ను పట్టించు కోకుండా మరో చోట కూర్చు న్నాడు.

నాలో కాస్త అనుమానం రేగింది. రాజారాంకి ఏమైంది?

రాజారాం, నేనూ ఎదురిళ్ళ వాళ్ళం. నాలుగేళ్లగా స్నేహితులం. పక్క పక్క ఆఫీసుల్లో పని చేస్తున్నాం.

రాజారాం కాస్త కలిగినవాడు. నాకేమో బాధ్యతలు.

రాజారాం ఇంట్లో రికార్డ్ ప్లేయ రుంది. నాకు ట్రాన్సిస్టర్ మాత్రం వుంది. రాజారాం ఇంట్లో టేపు రికార్డుంది. ఇప్పట్లో అది కొనే ఆలోచన కూడా నాకు లేదు. రాజారాం డ్రాయింగ్ రూం సోఫా సెట్లతో, షోకేసులతో కళ కళ లాడుతూంటుంది. నా డ్రాయింగ్ రూంలో నాలుగు కుర్చీలు, ఒక చాప మాత్రం ఉన్నాయి. రాజారాం భార్య నెలకు కనీసం రెండు చీరలు కొంటుంది. కొన్నప్పుడల్లా నూట యాభై కి తక్కువుండదు. మా ఆవిడ రెండు నెలలకో చీర కొం టుందేమో! చీర ఖరీదు సాధార ణంగా ఎనభై కి మించదు. బట్టలు పుచ్చుకొని స్టీలుసామానిచ్చే వాళ్ళు రోజూ రాజారాం ఇంటి చుట్టూ తిరుగుతారు. పిల్చినా మా ఇంటికి రారు.

ఇలా చెప్పుకుపోతే లెక్క వుండదు. ఎటొచ్చీ మా రెండు కుటుంబాలకీ మంచి స్నేహముంది.

రాజారాం కిద్దరు పిల్లలు. పెద్ద మ్మాయికి ఏడు. రెండోవాడికి ఐదు. నాకు ఇద్దరబ్బాయిలు. పెద్దవాడికి ఆరు. రెండోవాడికి ఐదు. రాజారాం పిల్లలకి రకరకాల ఆట బొమ్మలున్నాయి. మా పిల్లలకు రబ్బరుబంతులు మినహా మరేమి

లేవు. మా పిల్లలు రాజారాం ఇంటి కెళ్ళి ఆడుకుంటూంటారు. అక్కడ వాళ్ళకి ఆదరణ బాగుంటుంది.

నేను సంగీత ప్రియుణ్ణి. రాజారాం కొత్త రికార్డు కొన్నప్పు డల్లా వాళ్ళింటికి మమ్మల్ని పిలు స్తాడు. మా పిల్లల కంఠాలనతడు ఓ కాసెట్లో ఏటా రికార్డు చేస్తూం టాడు. మేము టేపురికార్డు కొను క్కొంటే ఆ కాసెట్ మాకిచ్చేస్తా నని చెప్పాడతను.

రాజారాం దంపతులు స్నేహ పాత్రులు వాళ్ళు మాపట్ల చూపే ఆదరాభిమానాలు మరువలేనివి. వాళ్ళకు పేదా—గొప్పా, చిన్నా-పెద్దా తారతమ్యాలు లేవు. మమ్మ ల్నెప్పుడూ వారు చిన్న చూపు చూడలేదు. మాటల్లోగానీ, చేతల్లో గానీ—తమ గొప్పతనాన్నీ, మా తక్కువతనాన్నీ సూచించరు. అందుకే నాలుగేళ్ళపాటు మా స్నేహం అవిచ్ఛిన్నంగా కొన సాగింది.

మరిప్పుడు రాజారాం కేమైంది?

ఇలాంటి విషయాలు ఆడవాళ్ళకి బాగా తెలుస్తాయి. ఈ ఉద్దేశ్యంతో సాయంత్రం ఇంటికెళ్ళినప్పుడు శ్రీమతిని అడిగాను. నేను చెప్పిం దంతా విని శ్రీమతి కంగారుగా, "నాకూ ఆవిడతో ఇలాంటి అను భవమే జరిగింది. ఆవిడ ఏదో కంగారులో ఉండి ఉంటుందేమోలే అనుకున్నాను. మీరు చెప్పింది వింటూంటే, నిజంగా ఏదో ఉందని పిస్తోంది" అంది.

సాయంత్రం పిల్లలు వాళ్ళిం టికి ఆడుకుందుకు వెళ్ళారు. వాళ్ళు మామూలుగానే వెళ్ళివచ్చారు.

రాజారాం దంపతులకీ మా దంపతులకీ మధ్య ఓ వారం రోజు లిలా మౌనయుద్ధం జరిగింది. నేనింక ఆగలేకపోతున్నాను. ఏ కారణం లేకుండా మేమిద్దరమూ ఇలా ఎందుకు వేరు పడిపోతు న్నాము? దీనికి అంతుమాడకపోతే ఎలా?

ఓ రోజున శ్రీమతి కారణం చెప్పింది. వీధిలోని పాపాయమ్మ గారింటికి వెళ్ళినప్పుడావిడ—"ఏ మమ్మా, శారదమ్మా! ఆ పార్వ తమ్మా, మీరూ అంతపూసుకు తిరిగేవారు కదా! మీ ఆయనకు ప్రమోషన్ వస్తే ఆ కబురు వాళ్ళకు చెప్పొద్దూ? చెబితే వాళ్ళే మైనా అసూయ పడిపోతారను కున్నావా?" అంది.

దానితో శ్రీమతికి క్లూ దొరికి నట్లయింది. ఇంతకూ జరిగినదేమి టంటే నాకు ప్రమోషన్ వచ్చింది. ఒకవిధంగా చెప్పాలంటే ఇది అను

కోని ప్రమోషన్. మా ఆఫీసులోని పై అధికారి ఒకాయన ఉన్నట్టుండి ఉద్యోగం వదిలేసిపోయాడు. ఆఫీసులో ఆయన తర్వాత నేనే సీనియర్ని. అంత మాత్రాన ఆ ఉద్యోగం నాకు రావలసింది కాదు. నా బేసిక్ ఐదు వందలు. ఆ ఉద్యోగం బేసిక్ తొమ్మిది వందలు. నలుగుతో పాటు అప్లై చేసినా, అదెవరో బయటవాళ్ళకి ఇస్తుందను కున్నాను. అది నాకే వచ్చింది.

ప్రమోషన్ వచ్చాక నేనింకా తొలిజీతం అందుకోలేదు. అందు కొన్నాక ఓ రోజు రాజారాం కుటుంబాన్ని మా ఇంటికి భోజనానికి పిలుద్దామనుకున్నాను అంతవరకూ ప్రమోషన్‌వార్త రహస్యంగానే ఉంచాలనుకున్నాను.

ప్రమోషన్ వచ్చినట్లు నేనింటికుత్తరం రాయలేదు. అలా రాస్తే నాన్నగారింటి కింకో వందో-రెండు వందలో అదనంగా పంపమని ఉత్తరం రాస్తారు. ఆయనకు నేనంటే లోకువ. తమ్ముడు నాకంటె ఎక్కువ సంపాదిస్తున్నా వాడేమి ఇవ్వడు కాబట్టి వాణ్ణేమీ అడగరు. నేను మెత్తటి వాణ్ణి కాబట్టి తనకు అవసరంలేకపోయినా నన్ను డబ్బడుగుతారు. నేనెంతిచ్చినా ఆయనకు తృప్తి ఉండదు. నేనేదో వెన కేసుకుపోతున్నానని ఆయన భ్రమ.

నా ఖర్చులెలాంటివంటే హఠాత్తుగా ఓ లక్ష నా చేతికందినా నేను లక్షాధికారిని అసలే కాను. నాది మొహమాటం స్వభావం. నేను రిజర్వ్‌డ్ మనిషిని అందుకని ప్రమోషన్ విషయం ప్రచారంచేయలేదు. ఇది రాజారాంకు బాధను కలిగిస్తుందని నేనూహించలేదు.

ఇప్పుడు కారణం తెలిసింది కాబట్టి వెంటనే రాజారాం ఇంటికి వెళ్ళాలనుకున్నాను. ఆ సాయంత్రమే సకుటుంబంగా రాజారాం ఇంటికి వెళ్ళాం. కాస్త ఇబ్బంది పడుతూనే వాళ్ళు మమ్మల్నాహ్వానించారు.

నేను రాజారాంకి నా ప్రమోషన్ గురించి, అది వెంటనే అతనికి చెప్పకపోవడం గురించీ కారణాలు వివరించి, "మీవంటి స్నేహితులకైనా ఈ శుభవార్త చెప్పకుంటే తప్ప మనసుకుల్లాసంగా ఉండదండీ! అందుకే ఇంక ఆగలేక వచ్చేశాను" అన్నాను.

మాటల సందర్భంలో నేను గ్రహించిన దేమిటంటే-రాజారాం, నేను ఇంతవరకూ ఒకే రకం ఉద్యోగులం. జీతంలో అతడికే నాకంటే ఓ యాభై రూపాయలు ఎక్కువవచ్చేది. ఇప్పుడు ఒక్క

పారిగా నా జీతం నాలుగైదొందలు పెరిగింది. దాంతో నాకు గర్వం పుట్టిందన్న అనుమానం ఆ దంప తులకొచ్చింది.

"మీకూ మాకూ పోలికేమి టండీ! జీతం రాళ్ళమీద ఆధారపడి బ్రతివాణ్ణి నేను. సరదాకు ఉద్యోగం చేస్తున్న వాళ్ళుమీరు. మీ రిదివరలో మాకుచేసిన ఉపకారాలు మర్చి పోతానా?" అన్నాను.

గతంలో నా కెప్పుడు డబ్బు అవసరమైనా రాజారాంని అడిగి తీసుకొనేవాణ్ణి వీలైనంత త్వరగా తిరిగి ఇచ్చేసేవాణ్ణి. మా నాలుగేళ్ళ పరిచయంలోనూ ఇది ఓ పదిసా ర్లయినా జరిగి ఉంటుంది.

నా మాటలకు రాజారాం సంతో షించాడు. మళ్ళీ ఎప్పటిలా నాతో మాట్లాడ్డం ప్రారంభించాడు.

ఇలా కొంతకాలం జరిగాక మా ఆవిడకా ఊళ్ళో నిర్వహించిన ఏదో చిత్రలేఖనాల పోటీలో బహు మతి వచ్చింది బహుమతి మొత్తం కూడా తక్కువకాదు. రెండువేల రూపాయలు. ఈ శుభవార్తను అందరికంటె ముందుగానే శ్రీమతి-పార్వతమ్మకు చెప్పింది. ఆ వార్త విని పార్వతమ్మ పెద్దగా సంతో షించలేదుట. ముభావంగా అభినం దించి ఊరుకున్నదట.

మర్నాటినుంచీ రాజారాం మళ్ళీ నన్ను పలకరించడం మానేశాడు.

ఏమయిందా అని కొట్టుకు చచ్చాను. క్రితంసారి శుభవార్త వెంటనే చెప్పలేదని కోపం వచ్చింది. ఈసారి వెంటనే చెప్పి నందుకు కోపంవచ్చిందా? అయితే ఎందుకు?

ఈ ప్రశ్నకు కూడా సమాధానం అమ్మలక్కల ద్వారానే వచ్చింది.

"శారదమ్మా! నీ బొమ్మకేదో బహుమతొస్తే పనికట్టుకుని ఒక్క ఆ పార్వతమ్మకే చెప్పి ఇంకెవరికీ చెప్పలేదటగా! ఆవిడకు బొమ్మ వేయడం రాదనీ, ఆవిడకంటె నువ్వు గొప్పదానివని చెప్పుకోవడం కోసం కాకపోతే అలా చేయడ మెందుకు?" అని నిలదీసిందిట ఓ జానకమ్మగారు.

శ్రీమతి కళ్ళ నీళ్ళుపెట్టుకుని జరి గింది నాతో చెప్పింది.

నేనూ చాలా ఆశ్చర్యపడ్డాను. తర్వాత శ్రీమతిని కాస్త కోప్పడ్డాను కూడా. "నువ్వావిడకు ఏ పద్ధతిలో చెప్పావో గానీ, ఆవిడ మనసు గాయపడినట్టుంది. మనం ఓసారి వాళ్ళింటికి వెళ్ళి అపార్థం పోగొట్టి వద్దాం-" అన్నాను.

ఇద్దరం సకుటుంబంగా వాళ్ళిం టికి వెడితే ఆ దంపతులు ముఖా

వంగానే మమ్మల్నాహ్వానించారు. కాసేపు అవీ ఇవీ కబుర్లు చెప్పి - నేను రాజారాం అభిరుచుల్ని అభినందించాను. శారదైతే ఒకడుగు ముందుకువేసి - "మా ఆయనంటారూ-నీలో కళ ఉంటే నీ ఇంటికి కళరాదు. కళాత్మకంగా ఇల్లు తీర్చి దిద్దుకోవడం కూడా ఓ పెద్ద కళ. పార్వతమ్మగారు చూడు- ఇల్లెంత నీటుగా ఉంచుతారో! అందుకావిడ ఎంతో శ్రమపడతారో కానీ. మళ్ళీ మనిషి ఎప్పుడూ నీట్‌గా కనబడతారు అని! నన్నాయనల్లాగన్నందుకు కోపగించుకోవలసిందే. కానయితే మీది మరీ ఎదురిల్లయిపోయింది. నిజం స్పష్టంగా ఎదురుగా కనిపిస్తుంటే నేనుమాత్రం ఏమనేది?" అంది.

ఈ మాటలకు పార్వతమ్మ ఉబ్బితబ్బిబ్బయింది. రాజారాం కూడా సంబరపడ్డాడు.

మేము రాజారాం దంపతుల కంటె ఇంకా తక్కువ స్థాయివాళ్ళమేనని వాళ్ళకు నమ్మకంగా చెప్పి వచ్చాక, మాకూ కాస్త తృప్తిగా ఉంది. మర్నాటినుంచి రాజారాం మామూలు మనిషయ్యాడు.

నా గురించి ఎవరేమనుకున్నా నాకు బెంగలేదు. కానీ నా కారణంగా ఎవ్వరూ అసంతృప్తిగా ఉండకూడదు. అదీ నా కోరిక. అందువల్లనే రాజారాం ఇంటికివెళ్ళి మరీ పొగిడివచ్చాం.

ఐతే నా జాతకం తిరిగినట్లే ఉంది. నాకు అడపా తడపా కథలు రాసే అలవాటున్నది. ఉన్నట్లుండి ఓ పత్రికవారు నా కథకి వెయ్యి రూపాయలు బహూమతి ఇచ్చారు. ఆ వార్త కాస్తా ముందుగానే రాజారాంకేగాక వీధిలో అంతా ప్రచారం చేశాను.

ఐనా రాజారాం దంపతులకు కోపం వచ్చింది.

"ఈ రోజుల్లో అడ్డమయిన వాళ్ళూ కథలు వ్రాస్తూనే వున్నారుట ఉద్యోగంలో కాస్త మంచి పొజిషన్‌లో వాళ్ళకి ప్రైజులొస్తుంటాయట. ప్రయత్నిస్తే ఎవడైనా రచయిత కావచ్చుట. పేరు తెచ్చుకోవచ్చుట. బహూమతులు సంపాదించవచ్చునట. ఈ మాత్రందానికి ఊరంతా ప్రచారం చేయడం ఎందుకూ?" అన్నారట వాళ్ళు.

ఏం చేయాలో నాకు తోచలేదు. రాజారాం మళ్ళీ నాతో ముభావంగా ఉంటున్నాడు.

నేను, శ్రీమతి వాళ్ళింటికి వెళ్ళి అతడి వాక్చాతుర్యాన్ని పొగిడాం. నా కథలకు ప్లాట్లు అతడితో చేసే సంభాషణల్లోంచే పుట్టుకొస్తాయని

నేను చెప్పాను. రాజారాం తృప్తి డిపనట్లే వుంది.

అప్పుడు నేను గ్రహించిన విశేషమిది. నా జాతకం నిజంగా తిరిగింది. నేను ఆర్థికంగానేగాక ఇతరత్రా కూడా ఎదుగుతున్నాను. అది రాజారాం సహించలేకపోతు న్నాడు. అతను నన్ను చూసి అసూయపడుతున్నాడు. అతడి భార్య నా భార్యను చూపి అసూయ పడుతోంది. అందుకు కారణం ఏమీ లేదు. ఈ నాలుగేళ్ళలోనూ అతడిలో చెప్పుకోదగ్గ మార్పేమీ లేదు. నేనొక్కడినే వృద్ధిలోకి వస్తున్నాను.

నా అభిప్రాయంతో శ్రీమతి కూడా ఏకీభవించింది. కానీ, ఈ సమస్యకు పరిష్కారం తెలియడం లేదు. బొత్తిగా ఎదురింట్లోనే ఉంటూ, ఏ కారణం లేకుండా మాట్లాడటం మానివేస్తే వారికి బాగుండినా నాకు బాగుండదు.

ఆఫీసర్‌ని కాకాపట్టినా, లంచం పెట్టినా బోడి ప్రమోషన్ ఎవరికైనా వస్తుందట. అలాగని రాజారాం అలాంటి ప్రయత్నాలేం చేసినట్లులేదు.

తను తీరిక సమయాల్లో కుట్లు, అల్లికలు వగైరా ఇంటికి పనికొచ్చే పనులే చేస్తుందట పార్వతమ్మ. లేకపోతే బొమ్మ వేయడం ఓ బ్రహ్మవిద్య కాదంటుందావిడ. పాపం, శారద అదో బ్రహ్మవిద్య అని ఎన్నడూ అనకపోయినా సరే!

తీరుబడి చేసుకున్నారోచ్చావాలి గానీ, తను వారానికి పది తక్కువ గాకుండా కథలు వ్రాయగలనంటాడు రాజారాం. అలా చేయకుండా అతన్నెవరాపుతున్నారో నాకు తెలియదు.

ఎదుటివారి శక్తులను తక్కువ చేసి మాట్లాడేవాడు అసూయతో బాధపడటంలో సందేహం లేదు. కానీ రాజారాం నాపట్ల ఇంతకాలం వదలి ఇప్పుడు అసూయపడటం ప్రారంభించడం నాకు బాధగా ఉంది.

కాసేపాలోచిస్తే కారణం తట్టింది. నేను కథలు చాలా కాలంగా వ్రాస్తున్నాను కాని కథకుడిగా నాకు చెప్పుకోదగ్గ గుర్తింపులేదు. శ్రీమతి బొమ్మలు వేయడం పెళ్ళికి ముందే ప్రారంభించినా ఇటీవలే ఆమె విద్య ఉన్నత శిఖరాలనందుకోవడమూ, గుర్తింపు పొందడమూ జరిగింది.

దూరాన ఉండే చిత్రకారులనూ, రచయితలనూ రాజరాం దంపతులు పొగుడుతారు. కానీ తమ ఎదురుగా ఉన్నవారు, తాము సామాన్యులని

భావించినవారు, ఆ జాతిలో చేరు తూంటే అసూయపడుతున్నారు.

రోజులు గడుస్తున్నాయి. మా సమస్యలు నానాటికి పెరుగుతున్నాయి శ్రీమతి ఇప్పుడు కొన్ని పత్రికలకు ముఖ చిత్రాలు వేస్తున్నది. నేను నవలలు కూడా రాస్తున్నాను. ఇంకా చెప్పాలంటే మా పిల్లలు రాజారాం పిల్లలకంటే బాగా చదువుతున్నారు. మా ఆర్థిక స్థితి కూడా బాగా మెరుగైంది. శ్రీమతి ఖరీదైన చీరలు కడుతోంది. పిల్లలు దర్జాగా ఉంటున్నారు. ఇవన్నీ ఒకరితో పోటీపడాలని నేను చేయడంలేదు. నా స్థాయికి తగినట్లు నేను జీవిస్తున్నాను.

అయినా మేము ప్రతి విషయంలోనూ పోటీ పడుతున్నట్లు రాజారాం దంపతులు భావించారు. మా ఆవిడ చీరల సెలక్షన్ బాగో లేదనేవారు. నేను కొన్న రికార్డు ప్లేయర్ ఖరీదెక్కువ. అంతా దండగన్నారు. డబ్బొస్తోంది గదా అని తగలేసుకోవడమేగానీ, తీరువగా ఖర్చుచేయడం మాకు చేతగాదన్నారు. ఎన్ని అన్నా మేము సహించి వారితో మంచిగా వుంటున్నాము. కానీ ఎన్నాళ్ళిలా సహించేది?

క్రమంగా రాజారాం దంపతుల పైన మాకు ఏహ్యభావం బయల్దేరింది. పైకి ప్రేమనటించినా,

బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి
లోధ్ర
75 సంవత్సరములకు పైగా
సుఖజీవనమునకు
లోధ్ర టానిక్‌ను
వాడిన స్త్రీలు ఎందరో!
ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు
ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.
పేరు: ______
విలాసము: ______
______ PIN ______




కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14
ఏజంట్లు: సీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికిందరాబాద్ —

మనసులో వారంటే చిరాకు, ద్వేషం కూడా కలుగుతూండేవి. అదెంతవరకూ దారితీసిందంటే, ఒకోసారి ఆ వీధిలోంచి ఇల్లు కాళీ చేసి వెళ్ళిపోవాలనిపించేది. అయితే ఆ ఇల్లు మాకు చవకలో ఎన్నో సదుపాయాలతో దొరికింది. మీదు మిక్కిలి ఇంటి యజమాని మంచి వాడు.

నేను రచయితను కాబట్టి రచ నలు చేయడం నా చేతిలోనిపని కాబట్టి ఈ ఇతివృత్తాన్నాధారంచేసు కుని ఓ కథ రాశాను. కథ ప్రముఖ పత్రికలో పడడమేకాక అది రాజారాం దృష్టికి కూడా వెళ్ళింది.

కథ రాసేదాకా బాగానే ఉన్నా, అది ప్రచురింపబడటంతోనే నా గు దెల్లో రాయిపడింది. ఇప్పుడా దంపతుల నెలా ఎదుర్కోవాలని అన్నది నా భయం.

కానీ నా భయం వృధాయే అయింది. ఆ కథ చదివిన మర్నాటి నుంచి రాజారాం దంపతులు మాతో మరింత సన్నిహితులయ్యారు. ఆ తర్వాతనుంచి మేమెంత ప్రగతి సాధించినా-మాలో ఏ అభివృద్ధి కన బడినా వారసూయ చెందడానికి బదులు అభినందించ సాగారు.

బహుశా నా కథ ప్రభావమో ఏమిటో వాళ్ళు చీటికీ మాటికీ ముఖం ఇదిగా చేసుకోవడం పూర్తిగా తగ్గిపోయింది.

ఇలా కొన్నాళ్ళు జరిగేక ఇది నాకే ఇబ్బందనిపించింది.

ఇంతకాలం తరచుగా అసూయ పడే రాజారాం దంపతులు ఇప్పుడు మానేశారు. అంటే నా ప్రగతిలో ఏదో లోపం వచ్చిందా? వారసూయ పడేటంత వేగంగానే అభివృద్ధి చెందడంలేదా? తిరిగి వారసూయ పొందాలంటే నేనేం చేయాలి?

అప్పుడే నాకు స్ఫురించింది. రాజారాం దంపతు లసూయ పడ డమూ, మేము ప్రాధేయపడడమూ అయ్యేక - మే మిద్దరం రెట్టింపు కృషితో పనిచేసి తిరిగి వారసూయ పడే స్థితికి చేరుకునేవారం. వారి అసూయ మా ప్రగతికి ప్రోత్సాహ కరంగానూ, కొలబద్దగానూ కూడా ఉండేది.

వారి అసూయకు గురికావడం నా జీవితంలో ఒకభాగం. నాకు తృప్తినిచ్చే ఒక అంశం.

నా కథ నన్ను దానికి దూరం చేసింది.

ఇంట్లో సదుపాయాలన్నీ బాగానే ఉన్నా నా కిప్పుడిల్లు మారడానికి అభ్యంతరంలేదు. నే నుండే చోట నన్ను చూసి అసూయపడే మనిషి ఒక్కడంటే ఒక్కడుంటే! *